ప్రజాశక్తి

గురువారం 9 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉత్సాహంగా బృందాకరత్ సభలు

చింతపల్లి సభలో మాట్లాడుతున్న బృందాకరత్, చిత్రంలో అప్పలనర్స, బుల్లిబాబు

- పాడేరు ఏజెన్సీలో సిపిఎం జోష్
- ఆదివాసీల హక్కులు, చట్టాల రక్షణకు ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని వక్తలు పిలుపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పాడేరు, చింతపల్లి విలేకరులు

అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో బుధవారం సిపిఎం ఎన్నికల ప్రచార సభలు ఉత్సాహంగా సాగాయి. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ప్రసంగం ఆదివాసీలను ఆలోచింపజేసింది. గిరిజన ప్రాంతంలోని వనరులను కార్పొరేట్లకు అప్పగించేందుకే అటవీ సంరక్షణ చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం సవరించిందని బృందాకరత్ ఆయా సభల్లో పేర్కొన్నారు. బడా కార్పొరేట్ల లాభాల కోసం ఆదివాసీ హక్కులను దెబ్బతీస్తున్న బిజెపిని, దానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న టిడిపి, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కులను కాపాడే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ఆమె కోరారు. ఇండియా వేదిక తరపున బరిలో ఉన్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి శతక బుల్లిబాబులకు మద్దతుగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లిల్లో బుధవారం రోడ్‌షో, బహిరంగ సభలు జరిగాయి. వీటికి ముఖ్య అతిథిగా హాజరైన బృందాకరత్ తన ప్రసంగంతో, పాలకులకు సంధించిన ప్రశ్నలతో ఆకట్టుకున్నారు. ఆదివాసీ వ్యతిరేకులకు ఈ ఎన్నికల ద్వారా బుద్ధిచెప్పాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గత పదేళ్లలో గిరిజనప్రాంత అభివృద్ధి కుంటుపడిందన్నారు. అడవులను, అటవీ చట్టాలను, మిగతా 2లో..

బృందాకరత్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

పాలిసెట్‌లో మెరిశారు

రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన జ్ఞాన హర్షిత, శ్రీరామ్ భవదీప్

పాలిసెట్‌లో విశాఖ, అనకాపల్లి జిల్లాల విద్యార్థులు మెరిశారు. రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించి పలువురి మెప్పుపొందారు.

ప్రజాశక్తి - చీడికాడ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో పోతల జ్ఞానహర్షిత ప్రతిభ కనబరిచింది. చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన పోతుల అప్పలనాయుడు, ప్రగతి దంపతుల కుమార్తె అయిన జ్ఞాన హర్షిత రాష్ట్రస్థాయిలో 120 మార్కులకుగాను 120 మార్కులు సాధించి మొదటి ర్యాంకును కైవశం చేసుకుంది. ఆమె తండ్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. తల్లి ప్రగతి ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు. ర్యాంకు సాధించిన జ్ఞాన హర్షిత మాట్లాడుతూ భవిష్యత్తులో ఐఐటి మెయిన్స్‌లో ప్రథమ ర్యాంకు సాధించడమే తన లక్ష్యమన్నారు. ఆమెను గ్రామస్తులు అభినందించారు.

తగరపువలస : బుధవారం విడుదలైన ఎపి పాలిసెట్ -2024 ఫలితాల్లో తమ విద్యార్థి సీలం శ్రీరామ్ భవదీప్ 120 మార్కులకుగాను 120 సాధించి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించినట్లు స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ తెలిపారు. సీలం ఐశ్వర్య 119 మార్కులతో స్టేట్ 7వ ర్యాంకు, ఆర్.దర్శన్ 22వ ర్యాంకు, కె.తరుణ్ తేజ 24వ ర్యాంకు, బి.సందీప్, బి.సాయి వంశీ, మిగతా 2లో..

జ్ఞాన హర్షిత

శ్రీరామ్ భవదీప్‌ను అభినందిస్తున్న శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ

బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్‌పై ఫిర్యాదు

▶ వార్త 8లో..

మోడీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు

▶ వార్త 8లో..

ఆర్‌ఒలు అప్రమత్తంగా ఉండాలి

▶ వార్త 2లో..



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చీకటి దివాకర్, చిత్రంలో అజశర్మ, వాసా తదితరులు

'ప్రజాస్వామ్యానికే ఓటు' కవితల పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ రాసిన కవితల పుస్తకం 'ప్రజాస్వామ్యానికే ఓటు'ను బుధవారం నగరంలో ఆవిష్కరించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాజ్యాంగం పెద్ద ప్రమాదంలో పడిందని పేర్కొంటూ, రాష్ట్ర ప్రయోనాలకు తీరని హాని కలుగుతోందని చెబుతూ.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించాలనే సంకల్పంతో మార్చి 10 నుంచి మే 9 వరకు ప్రతి రోజూ ఒకటి చొప్పున అజశర్మ రాసిన కవితలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. పుస్తకాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ ఆవిష్కరించారు. అజశర్మ, ఉతరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంఎస్.వాసా, మిగతా 2లో..

సాధారణ భక్తులకు పెద్దపీట

- చందనోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు
- రాజకీయ ప్రొటోకాల్ దర్శనాలు ఉండవు
- విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తూ ఈ ఏడాది చందనోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అంతరాలయ దర్శనాలు ఉండవని తేల్చిచెప్పారు. ఎలాంటి రాజకీయ పరమైన ప్రొటోకాల్ కూడా ఉండబోదని స్పష్టం చేశారు. పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌తో కలిసి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ నెల 10న జరిగే లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవ వేడుకలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని, అందులో భాగంగా 6 కిలోమీటర్ల మేర బారికేడ్లు వేశామని పేర్కొన్నారు. క్యూ లైన్లలో భక్తుల రద్దీ ఎక్కువ కాకుండా కొన్నిచోట్ల హోల్టింగ్ పాయింట్లు పెట్టామని తెలిపారు. భక్తులకు తాగునీరు అందించే నిమిత్తం 160 ప్రాంతాలను గుర్తించి అక్కడ చర్యలు చేపట్టామన్నారు. క్యూ లైన్లలో ఎండ వేడిమి లేకుండా షామియానాలు ఏర్పాటు చేశామని, సుమారు 29,500 మంది భక్తులకు సరిపడా షామియానాలు ఏర్పాటు చేశామని వివరించారు. టిక్కెట్లను స్కాన్ చేసేందుకు అనువుగా 10 స్కానర్లను సమకూర్చామని, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సాధారణ భక్తులకు పెద్దపీట

టిక్కెట్ల రీ సైక్లింగ్ జరగకుండా చర్యలు చేపట్టామని, హోలో గ్రామ్ ఏర్పాటు చేశామని చెప్పారు. లైన్లలో మధ్యలో ఎవరూ చొరబడకుండా మెస్‌లు ఏర్పాటు చేశామన్నారు. 250 బయో టాయిలెట్లు, 60 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు. సుమారు లక్ష నుంచి లక్షా యాభై వేల వరకు భక్తులు రావొచ్చని అంచనా వేశామని, ఆ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సమన్వయంతో చందనోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు.

10వ తేదీ ఉదయం 3.30 నుంచి 4.30 వరకు అనువంశిక ధర్మకర్తలకు, దేవాదాయ శాఖ నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే వారికి మాత్రమే అంతరాలయ దర్శనాలు ఉంటాయని, మిగిలిన వారికి ఉండవని స్పష్టం చేశారు. రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి నీలాద్రి మెట్టు వరకు పంపిస్తామని చెప్పారు. రూ.1000, రూ.300, ఉచిత దర్శనాలు 3.30 గంటల నుంచే ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్యలో సేవకులకు, 4 నుంచి 5 గంటల మధ్యలో విభిన్న ప్రతిభావంతులకు దర్శనాల కోసం ప్రత్యేక స్లాట్ కేటాయించామని వివరించారు. దర్శనాలు చేసుకొని వచ్చే భక్తులకు అన్నదానం కూడా ఉంటుందని పేర్కొన్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, దానిలో పది రకాల శాఖల అధికారులు ఉంటారని స్పష్టం చేశారు.

రాజకీయ ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

చందనోత్సవం సందర్భంగా వచ్చే భక్తులను ప్రభావితం చేసేలా ప్రచారాలు చేస్తే గనుక సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని విలేకరుల సమావేశంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున హెచ్చరించారు. మతపరమైన ప్రాంతాల్లో ఎలాంటి రాజకీయ ప్రచారాలూ చేయకూడదని, అలా కాకుండా ఎవరైనా మితిమీరి ప్రవర్తిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

ట్రాఫిక్ సమస్యలు

ఉత్పన్నం కాకుండా చర్యలు : సిపి

గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పేర్కొన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, హనుమంతువాక వైపు నుంచి వచ్చే వారికి న్యూ గోశాల, వేపగుంట, గోపాలపట్నం వైపు నుంచి వచ్చే వారికి పాత గోశాల వైపు పార్కింగ్ స్థలాలను గుర్తించి చర్యలు చేపట్టామన్నారు. కొండ దిగువన, కొండపైన రెండు పోలీసు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఎక్కడిక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సుమారు 2000 మంది పోలీసు సిబ్బందిని విధుల నిమిత్తం కేటాయించామన్నారు. భక్తులను కొండపైకి తీసుకెళ్లేందుకు, దిగువకు తీసుకొచ్చేందుకు 50 మినీ, 40 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఒక వైపు నుంచి వెళ్లేందుకు, మరో వైపు నుంచి వచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. చందనోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సీనియర్ పోలీసు అధికారులను నియమించామని వివరించారు.

'ప్రజాస్వామ్యానికే ఓటు' కవితల పుస్తకం ఆవిష్కరణ

చంద్రికారాణి, కూన వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో నేడు అప్రకటిత ఎమర్జన్సీ అమలవుతోందని, ప్రజాస్వామ్య విలువలు కాలరాయబడుతున్నాయని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులైన ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రులను ఎన్నికల వేళ అరెస్టులు చేయడం, కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేయడం, ఎన్నికల బాండ్ల ద్వారా పచ్చి అవినీతికి పాల్పడడం ఎన్‌డిఎ నియంతృత్వ పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు బిజెపి సర్కారు అమ్మేస్తోందని తెలిపారు. కార్మిక హక్కులను హరిస్తూ చట్టాలను మార్చి వేస్తోందన్నారు. సామాన్యుల కడుపులు కొట్టి సంపన్నులకు దేశ సంపదను ధారాతత్తం చేస్తోందని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై దాడులు చేస్తూ సామాజిక న్యాయానికి తిలోదకాలిస్తోందని తెలిపారు.

మణిపూర్‌లో మారణహోమం వీరి కనుసన్నల్లోనే జరగడం, తీవ్రమవుతున్న ఆదాయ అసమానతలు వారి దుష్ట పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడం, రాష్ట్ర విభజన చట్టాన్ని అమలు చేయకపోవడం, రైల్వే జోన్ నేటికీ ఏర్పాటు చేయకపోవడం, తిరిగి తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును అమ్మేయాలని నిర్ణయించడం వంటి చర్యల ద్వారా రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. ఈ ద్రోహాన్ని ఎండగట్టి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసిన రాష్ట్ర అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆ పని చేయకుండా తిరిగి మోడీ ప్రభుత్వానికి దాసోహమవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో రాసిన కవితలు ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, జరుగుతున్న ప్రమాదాన్ని అర్థం చేసుకోవడంతో పాటు దాన్ని ఎదుర్కోవడానికి, ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూడడానికి సహకరిస్తాయని వక్తలు పేర్కొన్నారు.

పాలిసెట్‌లో మెరిశారు

ఆర్.దిలీప్ కుమార్ స్టేట్ 32వ ర్యాంకులు, వి.బి.గోపాలస్వామి, బి.శశాంక్ 42వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

ఉత్సాహంగా బృందాకరత్ సభలు

చిన్నారిని ఆప్యాయంగా పలకరిస్తున్న బృందాకరత్

(మొదటి పేజీ తరువాయి..) హక్కులను రక్షించుకోవడానికి అప్పలనర్సను అరకు ఎంపీగా, బుల్లిబాబును పాడేరు ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న అటవీ భూముల హక్కు పత్రాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ తన ఫొటో వేయించుకుని గిరిజనులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఆదివాసీ పోరాటాల్లో అండగా నిలిచి, చట్టసభల్లో ప్రజాగళాన్ని వినిపించే సత్తా ఉన్నా నాయకులను ఈ ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ గిరిజన ప్రాంతం పట్ల నిర్లక్ష్యం వహించిన పాలక పక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల ఓట్లు వేయించుకుని మైనింగ్ ఏజెంట్లుగా మారిపోయి, గిరిజనులకు ఆధారమైన అడవులను కట్టబెట్టేందుకు పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను తరిమితరిమి కొట్టాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం అటవీ భూములను అదానీకి అప్పగించేందుకు సిద్ధమైన పాలక పార్టీలను ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఆయా సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, కాంగ్రెస్ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి శతక బుల్లిబాబు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులు కంకిపాటి వీరన్నపడాల్, వంతల కృష్ణారావు, కుర్ర సూరిబాబు, కూడా సింహాచలం, ఎస్.గంగరాజు, సిపిఎం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు, శాంతి, సూరిబాబు, సిపిఐ నాయకులు పోతురాజు, ఎర్రబొమ్మల ఎంపిటిసి సభ్యుడు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీలు, ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

పాడేరులో నిర్వహించిన రోడ్‌షోలో బృందాకరత్, లోకనాథం, సిహెచ్.నర్సింగరావు తదితరులు పాల్గొనగా వారికి ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. గిరిజన మహిళలు థింసా నృత్యంతో ఆకట్టుకున్నారు.

పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు రోడ్డు షో సాగింది. దారి పొడుగునా బృందాకరత్ ప్రజలకు అభివాదం చేస్తూ ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో సభ జరిగింది. చింతపల్లిలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి సంత బయలు మీదుగా పాత బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు

ఆర్‌ఒలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఆర్వోలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన భూమిక పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు.కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎన్నికల సన్నద్ధతపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెక్టోరల్, రూట్ అధికారులతో సమన్వయం వహించాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాలని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని, నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట కనీస వసతులు కల్పించాలన్నారు. క్యూ లైన్ల వద్ద ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు సహాయం అందించేలా ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లను అందుబాటులో ఉంచుకోవాలని, వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.పోలింగ్ మెటీరియల్ పంపిణీ, ఈవీఎంల తరలింపు తదితర అంశాలపై సూచనలు చేసిన ఆయన సాంకేతిక పరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఓటర్ స్లిప్పులను నిర్ణీత సమయంలో అందజేయాలని చెప్పారు. పోలింగ్ రోజున ఓటర్లకు సహాయం అందించే విధంగా హెల్ప్ డెస్కును ఏర్పాటు చేయాలని, అందులో బిఎల్వోను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వెలుపలా పోటీ చేసే అభ్యర్థులతో కూడిన పోస్టర్, ఓటరు గైడ్ పత్రాలను గోడకు అతికించాలని సూచించారు. క్యూ లైన్లలో ఓటర్ల సంఖ్య ఎక్కువైతే ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సరిపడా పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాల వద్ద లోపల, బయట కూడా వెబ్ కాస్టింగ్ పెట్టాలని, సరిపడా లైటింగ్ ఉండేలా చూసుకోవాలన్నారు.

రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.పోలింగ్ ప్రక్రియకు 48 గంటల ముందుగానే సైలెంట్ పిరియడ్ అమల్లోకి వస్తుందని, ఎలాంటి ప్రచారాలు నిర్వహించ కూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ మేరకు ఆయా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైసిపికి వామనరావు రాజీనామా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: 2019 ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వి వామనరావు విమర్శించారు. నగరంలోని ఒక హొటల్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ కార్మికుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, వైసిపి ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎటువంటి న్యాయం జరగలేదని, దీని కారణంగా తాను వైసిపి సభ్యత్వానికి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.వారం రోజుల్లో సి.పి.ఎస్ రద్దు చేస్తానని, ఇంక్రిమెంట్ జమ, డి.ఎ పిఆర్‌సి ఇలా అనేక హామీలు ఇచ్చారని, తీరా అధికారం చేపట్టాక అమలు చేయకపోవడం దారుణమన్నారు. హామీలు అమలు చేయకపోగా ప్రతినెల 1వ తేదీన ఉద్యోగులకు జీతం, పెన్షన్ వాళ్లకు పెన్షన్ రావడం లేదని వాపోయారు.ఆసుపత్రి బిల్లులు చెల్లించలేదనే కారణంతో ఇ హెచ్ఎస్ కార్డులు నిరుపయోగం అవుతున్నాయన్నారు.

ఘనంగా రెడ్ క్రాస్ డే వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వరల్డ్ రెడ్ క్రాస్ డే, ఇంటర్నేషనల్ తలసేమియా డేని పురస్కరించుకొని మహారాణిపేటలోగల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బ్రాంచ్ వద్ద మంగళ, బుధ వారాలలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రెడ్ క్రాస్ ఫౌండర్ హెన్రీ డ్యూనంట్ జయంతిని పురస్కరించుకుని రెడ్ క్రాస్ పతాకాన్ని ఆవిష్కరించారు. హెన్రీ డ్యూనంట్‌కు నివాళులు అర్పించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ విక్రాంత హనుమంతు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అమోఘమన్నారు. తమ ఫౌండేషన్ తరపున తలసేమియా చిన్నారులకు సహకారాన్ని అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. అదేవిధంగా గెయిల్ ఇండియా సిజిఎం ఎల్ఎస్.రావు మాట్లాడుతూ విశాఖపట్నం రెడ్ క్రాస్, తలసేమియా సెంటర్ ద్వారా చిన్నారులకు పూర్తి ఉచితంగా రక్త మార్పిడి ప్రక్రియ చేయడం అత్యద్భుతమని, ఇంతటి భయంకరమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు మనోధైర్యం కలగాలని, తలసేమియా చిన్నారులు చదువులో కూడా ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. .రెడ్ క్రాస్ సంస్థ నడుపుతున్నటువంటి తలసేమియా సెంటర్‌లో రక్త మార్పిడి చేసుకున్నటువంటి చిన్నారులకు సంగీతం, నృత్యం, క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ ఎమ్‌డి.రెహమతుల్లా, అరుణ జ్యోతి, సెక్రటరీ పి.రవికుమార్, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ఎమ్.ప్రవల్లిక, ఎస్‌కెఎల్.రావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న చిన్నారులతో అతిథులు

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్ 3 పరిధిలో మంచినీరు సరఫరాచేయు ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురైనందున 9వ తేదీన పలు వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ వెజిటబుల్ మార్కెట్ వద్ద టిఎస్ఆర్ నుంచి బ్లాక్-6, 7 రిజర్వాయర్‌కు మంచి నీటి సరఫరా చేయు 600 ఎంఎం డయా, జిఆర్‌పి పంపింగ్ ప్రధాన పైప్ లైను మరమత్తులకు గురైందని, మరమత్తులు చేపట్టినందున గురువారం 16వ వార్డు పరిధి కెఆర్ఎం కాలనీ, శివాలయం, 22వ వార్డు పరిధి న్యూ రేసపువానిపాలెం, పిఠాపురం కాలనీ, పిఠాపురం ఉడా క్వార్టర్స్, పీతలవానిపాలెం, శివాజీపాలెం, 23వ వార్డు పరిధి మద్దిలపాలెం, ఆటో మొబైల్ రోడ్, కృష్ణ కాలేజీ రోడ్, ఆర్‌టిసి డిపో రోడ్డు, గాయత్రి స్కూల్ రోడ్డు, పెద్ద నుయ్యి ఏరియా, 24వ వార్డు పరిధి చైతన్యనగర్ ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఉండదని వివరించారు. ప్రజల తాగునీటికి అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయంగా జివిఎంసి నీటి సరఫరా విభాగం టాంకర్లు ద్వారా సంబంధిత ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

భీమిలిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఇండిపెండెంట్ అభ్యర్థి నాగమణి

ప్రజాశక్తి -తగరపువలస : ఈ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే భీమిలి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తానని ఇండిపెండెంట్ అభ్యర్థి నాగోతు నాగమణి చెప్పారు. స్థానిక ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దాదాపు 5నెలల పాటు నియోజకవర్గంలో జరిపిన క్షేత్ర స్థాయి పర్యటనలో ఎన్నో సమస్యలు తన దృష్టికి వచ్చినట్లు ఆమె వివరించారు. అనేక గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలు లేవన్నారు. ముఖ్యంగా పలు గ్రామాల్లోని దళిత వాడలు ఎన్నో అభివృద్ధికి దూరంగా ఉన్నాయని అవేదన వ్యక్తంచేశారు. తనకు ఎన్నికల సంఘం కేటాయించిన బకెట్ గుర్తుపై ఓటు వేసి భీమిలి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఏయూ విద్యార్థులకు అమెరికా సంస్థలో ఉద్యోగాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు 24 మందికి అమెరికాకు చెందిన యునైట్ సంస్థలో ఉద్యోగాలు లభించాయి. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 4, మహిళా ఇంజనీరింగ్ కళాశాల నుంచి 6, ఏయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి 14 మంది విద్యార్థులను ఈ సంస్థ ఎంపిక చేసింది. వీరికి ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి సమక్షంలో యునైట్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీధర్ అబ్బువరం నియామక పత్రాలను అందజేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులతో పోటీపడి ప్రతిభ చూపుతూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు, ప్లేస్‌మెంట్ అధికారులు విఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలి సెమిస్టర్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ నరసింగరావు

ప్రజాశక్తి -తగరపువలస : ఆంధ్రా యూనివర్సిటీ ఈ నెల 7వ తేదీన విడుదల చేసిన తొలి ఏడాది తొలి సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల చైర్మన్ బి నరసింగరావు, ప్రిన్సిపల్ జి సతీష్ కుమార్ తెలిపారు. బిఎస్‌సి కెమిస్ట్రీలో వి.పైడిరాజుకు 10 పా యింట్లకు 8.60 పాయింట్లతో మండలానికి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. కె.సింధు 10 పాయింట్లకు 8.45 పాయింట్లు సాధించినట్లు వివరించారు. 8 పాయింట్లకు పైగా 30 మంది, 7పాయింట్లకు పైగా 60 మంది సాధించారని తెలిపారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలలో చైర్మన్ నరసింగరావు, ప్రిన్సిపల్ సతీష్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఆఈట్ ఫలితాల్లో తగరపువలస విద్యార్థికి మూడో ర్యాంకు

మోహన్ సాయి సంపత్

ప్రజాశక్తి -తగరపువలస : ఆంధ్రవిశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఆఈట్-2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తగరపువలసకు చెందిన గిడుతూరి మోహన్‌సాయి సంపత్‌కు మూడో ర్యాంకు లభించింది. ఆఈట్ -2024 ఫలితాలను మంగళవారం ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. మే 5న రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ కేంద్రాల పరిధిలో 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం సబ్‌స్టేషన్ 11కెవి, మామిడిలోవ, 11కెవి శొంఠ్యాం ఇండస్ట్రియల్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పొలాంకి శ్రీనివాసరావు తెలిపారు. రామవరం, శొంఠ్యాం, జిఎస్.అగ్రహారం, గండిగుండం, మామిడిలోవ, గొంతినవానిపాలెం తదితర ప్రాంతాలకు గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, పారిశ్రామిక వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో మంగళవారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ బుధవారం కూడా కొనసాగింది. మొత్తం 1174 ఓట్లకు గాను గత రెండ్రోజులుగా జరిగిన పోలింగ్‌లో 671 ఓట్లు పోలయ్యాయి. పోలీస్, ఆర్‌డిఒ, ఉపాధ్యాయులు, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు.

కొనసాగుతున్న హోం ఓటింగ్

హోమ్ ఓటింగ్ గత రెండ్రోజులుగా కొనసాగుతోంది. నియోజక వర్గంలో ఇప్పటి వరకు 406 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి ఎన్నికల సంఘం ఈ దఫా ఈ తరహా సౌకర్యం కల్పించింది.

'జైభారత్'లో ముస్లిం మహిళల చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార : మద్రిపాలెంలోని ముస్లిం మైనార్టీకి చెందిన మహిళలు జై భారత్ నేషనల్ పార్టీలో చేరారు. జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణకు ముస్లిం మహిళలు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మోడల్ ఇవిఎంలు చూపించి ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. ఓటు వేసేటప్పుడు నోటుకు అమ్ముడుపోకుండా ఆలోచించి వేయాలని కోరారు. రక్షకులు కావాలో, భక్షకులు కావాలో ఆలోచించాలన్నారు. టార్చ్ లైట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి -కరాస: మే 11న జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రీమియర్ నేవల్ రీసెర్చి లేబొరేటరీ అయిన నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ వివిధ కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగా మే 9, 11వ తేదీలలో ఎన్ఎస్‌టిఎల్ ఉత్పత్తుల ప్రదర్శన, మల్టీ మీడియా ప్రజెంటేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై నమూనాల తయారీ పోటీలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మొత్తం 150 నమూనాలకు గాను 50 ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు ఎన్ఎస్‌టిఎల్ ప్రతినిధులు తెలిపారు. విజేతలకు జాతీయ సాంకేతిక దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

FORMAT C-1

(For candidate to publish in Newspapers, TV)

DECLARATION ABOUT CRIMINAL CASES

(As per the judgement dated 25th September , 2018, of Hon'ble Supreme Court in WP (CIVIL) No. 535 of 2011 (Public Interest Foundation 7 Ors. Vs. Union of India and Anr.)

Name and address of candidate : **KANNAPARAJU KAMMILA, D.No.50-119-3/3/14, FLAT No. 402, 3rd Floor, Balaji Dolphin Enclave, SEETHAMMADHARA, VISAKHAPATNAM – 530013**

Name of the political party : **YUVAJANA SRAMIKA RYTHUCONGRESS PARTY (YSRCP).**

Name of Election : **ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY.**

*Name of the Constituency : **23-VISAKHAPATNAM NORTH CONSTITUENCY.**

I,**KANNAPARAJUKAMMILA** candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

Pending Criminal Cases				Details about cases of conviction for criminal offences	
Sl. No.	Name of Court	Case No. and status of case	Section(s) of Acts concerned and brief description of offence(s)	Name Court & date(s) of order(s)	Description of offence (s) & Punishment imposed
1	Not Applicable	FIR NO. 83/2023 OF II TOWN P.S, VISAKHA PATNAM Pending investigation	U/s 354,323,509,341, 326(A),326(B), 506 r/w 147,120b r/w 34 IPC, 156(3) Cr PCon 21.04.23 at 10.00 Hrs. at women's College, South Jail Road, Visakhapatnam all the accused present, raised slogans and misbehaved with the complainant and others abused in vulgar language with an intention to outrage their modesty and pushed and cot hold her tuft and removed her chunny and threatened her to kill.K K RAJU shown as A-2	Not Applicable	Not Applicable
2	ACMM, VISAKHA PATNAM	CC NO. 2412/2019 (FIR No. 191/2019 OF IVTH TOWN P.S) Summons	U/s 188,171,341 IPC,34PA-1861. On 11.04.2019 at 18.00 hrs at Main Gate, GVMC Primary Sc hool, Railway New Colony, Polling Stations shouting heavily slogns against elections and restrained voters. K K RAJU shown as A-2.	Not Applicable	Not Applicable
3	Not Applicable	FIR NO. 649/2018, Of AIR PORT P.S, VISAKHA PATNAM Pending Investigation	U/s 341,427 r/w 34 IPC On 25.10.2018 at 14.50 hrs at airport Junction on NH-16 Road blocked and restrained the moving vehicles and also Team Indis Players Bus . K K RAJU shown as A-1.	Not Applicable	Not Applicable

sd/- KANNAPARAJU KAMMILA,
23-VISAKHAPATNAM NORTH CONSTITUENCY.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
గురువారం
9 మే 2024

కలం మాట

నాయికా... తెలుసుకో..!

సహజ వనరుల స్వాహాతో సంపన్నులవ్వంగ
అందుకు చట్టసభల్లో స్థానం పొందంగ
భూమి పుట్టల బలములు కలిమిగ ఉన్నోళ్లు
కోటానుకోట్ల దొంగ ఆస్తుల్ని
మస్తుగ కూడబెట్టినోళ్లు
రాజకీయ రంగు, రుచి,
రూపురేఖల్ని మార్చేశారు..
రోజుకొక్క జెండాతో, పూటకొక్క
పార్టీలోకి జంపింగ్ చేస్తారు...
ప్రజాస్వామ్యాన్ని ప్రాణంగా భావించే
ప్రజలు మాత్రమే ఆలోచిస్తారు
నువ్విచ్చిన నోటుకు, ఉచిత పథకాలకు
ఓటును అమ్ముకోరు...
ఓటేసే సమయంలో
ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు..
తమ జీవితాలను
ప్రజలు పరికించి చూసుకుంటారు
ధరలు, దరువుల్ని, పన్ను పోట్లను
బతుకు తెరువును బేరీజు వేసుకుంటారు..
దేశ భవిష్యత్‌ను దిశానిర్దేశం చేసే
ఓటును సద్వినియోగ పరుస్తారు..
మతోన్మాద కుట్రలు, కుతంత్రాలను
మట్టుబెడతారు..
ఓటు అనే ఆయుధంతో
అవకాశవాదులకు బుద్ధి చెబుతారు
ప్రజాతంత్ర లౌకిక వాదులను
గెలిపించి తీరుతారు...

- పెంటకోట రామారావు,
కంచరపాలెం,
మొబైల్ : 82477 97303

సమస్యల పరిష్కారానికి కృషి

తానాంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోనిచినగొల్లలపాలెం, ఇరువాడ, పైడివాడ, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం గ్రామాలలో బుధవారం జనసేన, బిజెపి, టిడిపి కూటమి బలపరిచిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పైడివాడ అగ్రహారంలో పంచకర్ల దృష్టికి పలు సమస్యలను స్థానిక ఎంపిటిసి సీరం అప్పలరాజు తీసుకెళ్లగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కటొక్కటిగా అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గాజు గ్లాసు గుర్తుపైనా, అనకాపల్లి ఎంపిగా బిజెపి అభ్యర్థి సిఎం రమేష్‌ను కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో గండి వంశీ, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గి నాయుడు, సరిపల్లి విష్ణు, బిజెపి నాయకులు వనం సత్యనారాయణ గోంప నర్సింగరావు, కోరాడ శ్రీనివాసరావు పల్లా తాతారావు, బలిరెడ్డి సూర్య ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

తానాంను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా

పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో మంగళవారం రాత్రి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు ప్రచారం చేశారు. గ్రామంలోని మహిళలు, యువకులు, కార్యకర్తలు, పైలా యువసేన, కన్నూరు యువసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, పంచకర్లపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భ తానాం గ్రామాన్ని దత్తత తీసుకుంటానని, ఫార్మా కాలుష్యంతోపాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి, మాజీ జడ్పిటిసి పైలా జగన్నాథరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి మాదంశెట్టి నీలబాబు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం

సమస్యల లోగిలి పెందుర్తి!

అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలున్నా.. పాలకులు నిర్లక్ష్యంతో వెనుకబడి ఉన్న నియోజకవర్గాల్లో పెందుర్తి ఒకటి. జిల్లాల పునర్విభజన తర్వాత అటు విశాఖ, ఇటు అనకాపల్లి జిల్లాల్లో చెరో కొంతభాగం ఉన్న నియోజకవర్గంగా ప్రత్యేకత ఉన్న పెందుర్తిలో ఇప్పటివరకు ఏ అభ్యర్థి కూడా రెండోసారి గెలుపొందని అరుదైన రికార్డు కూడా ఉంది. విశాఖ జిల్లాలోని పెందుర్తి మండలంతోపాటు జివిఎంసిలో కొన్ని వార్డులు పూర్తిగా అర్బన్ కాగా, అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం, పరవాడ మండలాలు గ్రామీణ వాతావరణంలో ఉన్నాయి. మహానగరానికి ఆనుకుని, అంతర్భాగంగా ఉన్న నియోజకవర్గమే అయినా, ఉన్నత విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి, ఇలా ప్రతి అవసరాలకు అటు విశాఖగానీ, అటు అనకాపల్లి గానీ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పంచ గ్రామాలు, పరవాడ ఫార్మా కాలుష్యం, తాడి తరలింపు వంటి సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి.వీటిపై టిడిపి, వైసిపి ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. (ప్రజాశక్తి - పెందుర్తి)

- హామీలకే పరిమితమైన పంచగ్రామాల భూసమస్య
- ఫార్మా కాలుష్యంలోనే కూనరిల్లుతున్న తాడి
- కనీస సౌకర్యాలు కరువై తల్లడిల్లుతున్న జనం
- ఓట్ల కోసం మభ్యపెడుతున్న టిడిపి కూటమి, వైసిపి
- ప్రజాసమస్యలపై పోరాటంలో ఇండియా బ్లాక్

1978లో పెందుర్తి పేరుతో ఆవిర్భవించిన అసెంబ్లీ నియోజకవర్గంలో తొలి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ అప్పన్న సిపిఎం అభ్యర్థి గంగాధరరావుపై గెలుపొందారు. అప్పన్న అకాల మరణంతో 1980లో ఉపఎన్నిక రాగా, స్వతంత్ర్య అభ్యర్థి పి.సింహాచలంపై ద్రోణంరాజు సత్యనారాయణ గెలుపొందడం ద్వారా సిటింగ్ స్థానాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకుంది. 1983లో టిడిపి ఆవిర్భావం తర్వాత ఆపార్టీ తరపున పోటీచేసిన పెతకంశెట్టి అప్పలనరసింహం, కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజుపై విజయం సాధించారు. 1985లో అప్పలనరసింహంను పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి నిలపడంతో టిడిపి తరపున ఆళ్ళ రామచంద్రరావు పోటీకి దిగి, కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావుపై గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాధరావు టిడిపి అభ్యర్థి పి.సింహాచలంపై గెలిచారు. 1994లో సిపిఐ తరపున మానం ఆంజనేయులు, 1999లో టిడిపి అభ్యర్థి పివిజిఆర్.నాయుడు (గణబాబు) కాంగ్రెస్ అభ్యర్థి డి.శ్రీనివాస్‌పై విజయం సాధించారు. 2004లో కాంగ్రెస్ నుంచి తిప్పల గురుమూర్తి రెడ్డి, టిడిపి అభ్యర్థి పి.నాగమణిపైనా, 2009లో ప్రజారాజ్యం నుంచి పంచకర్ల రమేష్‌బాబు కాంగ్రెస్ అభ్యర్థి గండి బాబ్జిపైనా గెలిచారు. 2014లో టిడిపి నుంచి బండారు సత్యనారాయణమూర్తి వైసిపి అభ్యర్థి గండి బాబ్జిపై విజయం సాధించగా, 2019లో వైసిపి నుంచి అదీప్‌రాజ్ టిడిపి అభ్యర్థి బండారుపై గెలిచారు. అయితే 2009లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ప్రస్తుతం పెందుర్తి నియోజకవర్గంలో అంతర్భాగమైన పరవాడ పేరుతో ఉన్న నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో 1985లో పైలా అప్పలనాయుడు, 1989, 1994, 1999 ఎన్నికల్లో బండారు సత్యనారాయణమూర్తి, 2004లో గండి బాబ్జి ఎన్నికయ్యారు.

12వసారి ఎన్నికలపై అందరి దృష్టి

నాలుగున్నర దశాబ్దాల పెందుర్తి చరిత్రలో ప్రతిసారి ఎన్నికల్లోనూ కొత్తవారికే విజయాన్ని అందిస్తున్న పెందుర్తి నియోజకవర్గవాసులు ఇప్పటివరకు 11సార్లు ఎన్నికలు కాంగ్రెస్, టిడిపి చెరో నాలుగుసార్లు విజయం సాధించగా, సిపిఐ, ప్రజారాజ్యం, వైసిపి చెరో విజయం దక్కించుకున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న 12వసారి ఎన్నికల్లో వైసిపి తరపున సిటింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థిగా పంచకర్ల శ్రీనివాసరావు, ఇండియా బ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పిరిడి భగత్ ప్రధానంగా పోటీలో ఉన్నారు. వీరిలో అదీప్‌రాజ్ వైసిపి తరపున, పంచకర్ల ప్రజారాజ్యం తరపున ఒక్కోసారి పెందుర్తి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. రెండోసారికి అవకాశమివ్వని పెందుర్తిలో ఈసారి సంచలనం నమోదవుతుందా? లేక ఆనవాయితీ కొనసాగుతుందా అని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఒక్కసారే ఆనవాయితీ కొనసాగితే మొత్తం 14మంది పోటీ బరిలో ఉండగా, గెలుపు ఎవరిని వర్తిస్తుందనే చర్చలో కాంగ్రెస్ అభ్యర్థి ముందువరుసలో ఉన్నారు.

పంచకర్ల రమేష్‌బాబు (జనసేన)

అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసిపి)

పిరిడి భగత్ (కాంగ్రెస్)

హామీలకే పరిమితమైన ప్రధాన సమస్యల పరిష్కారం

పెందుర్తి నియోజకవర్గంలో ప్రధానంగా వేధిస్తున్న పంచగ్రామాల భూసమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉంది. ఈ సమస్య పరిష్కారానికి టిడిపి, వైసిపి పార్టీలు హామీలకే పరిమితమై, ఇదిగో,అదిగో అంటూ ఇన్నాళ్లు ఊరిస్తూ వచ్చాయి. తాజా ఎన్నికల్లోనూ ఇదే అంశాన్ని ఎన్నికల ఎజెండాగా మళ్లీ తెరపైకి తెచ్చి, ఐదు గ్రామాల్లో లబ్ధిపొందాలని చూస్తున్నాయి. టిడిపి తరపున గెలిచిన బండారు, ప్రజారాజ్యం తరపున గెలిచి, ప్రస్తుతం జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్న పంచకర్ల రమేష్‌బాబు, వైసిపి అభ్యర్థి సిటింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇన్నాళ్లు నాన్చుతూ వచ్చారే తప్ప పరిష్కారానికి చర్యలు చేపట్టలేదు. ఇక అనకాపల్లిజిల్లా పరిధిలో పరవాడ ఫార్మా కాలుష్య సమస్య గ్రామీణ ప్రజలను వెంటాడుతోంది. ముఖ్యంగా కాలుష్యంతో కూనరిల్లుతున్న తాడి గ్రామస్తులకు పునరావాసం కల్పించి, సురక్షితప్రాంతానికి తరలింపు సమస్య కొలిక్కి రాలేదు. దీనిపై టిడిపి, వైసిపిలు హామీలతో కాలయాపన చేయగా, సమస్య పరిష్కారానికి ఇండియాబ్లాక్‌లోని సిపిఎం ఏళ్లతరబడి పోరాటం చేస్తూనే ఉంది. వీటితోపాటు పెందుర్తి విలీన గ్రామాల్లో భూపోరాటం ద్వారా అనేక మందికి పేదలకు ఇళ్లస్థలాలను ఇప్పించేందుకు సిపిఎం కృషి చేయగా, ఆయా కాలనీల్లో తాగునీరు, సిసిరోడ్లు, డ్రైనేజీల వంటి మౌలిక సదుపాయాలు లేక జనం ఇబ్బంది పడుతున్నారు.

ఓటరు స్లిప్ పొందడం ఎలా..?



ఓటింగ్ స్లిప్‌లను కేంద్ర ఎన్నికల సంఘం(సిఇసి) జారీ చేస్తుంది. ఇందులో ఓటరు పేరు, వయసు, లింగం, అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ బూత్ నంబరు, పోలింగ్ తేదీ, సమయం తదితర వివరాలు ఉంటాయి. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు స్లిప్పులు పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులను అందించే బాధ్యతను బూత్ లెవెల్ ఆఫీసర్లుకు అప్పగించారు. కానీ, చాలామందికి ఓటరు స్లిప్పులు అందడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సంబంధిత బిఎల్వో మొబైల్ నంబర్ తెలిస్తే ఫోన్‌చేసి వారి నుంచి పొందే అవకాశముంది. లేదా ఆన్‌లైన్‌లోనూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

(ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్)

ఓటరు స్లిప్ పొందాలంటే..

ఓటరు స్లిప్పులు ఎన్నికల సిబ్బంది నుంచి అందకపోతే ఆన్‌లైన్, మొబైల్ యాప్, హెల్ప్‌లైన్ నెంబర్, మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా పొందడానికి ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఒకవేళ ఫిజికల్,డిజిటల్ ఓటరు స్లిప్ లేకపోయినా నేరుగా పోలింగ్ బూత్ కు వెళ్లి చెక్ చేసుకోవచ్చు.అదే పోలింగ్ కేంద్రంలో పేరు ఉంటే, గుర్తింపు కార్డును చూపి ఓటు వేయవచ్చు.

ఒక్క ఉచిత మెసేజ్‌తో...

ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను టైప్ చేసి 1950, లేదా 92117 28082 నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపితే వివరాలు వస్తాయి. ఎటువంటి రుసుం లేకుండానే, ఈ నెంబరుకు పంపిన వివరాలను సరిపోల్చుకుని ఎన్నికల సంఘం తగిన సమాచారాన్ని పంపుతుంది.

ఆన్‌లైన్‌లో అయితే..

Ceo.ap.nic.in అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ యువర్ నేమ్, అసెంబ్లీ, ఓటర్స్ సర్వీస్ పోర్టల్ మెనూ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు లేదా మొబైల్ నెంబర్ లేదా పేరును ఇవ్వడం ద్వారా ఏ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చో తెలుసుకోవచ్చు. అంతేకాకుండా డిజిటల్ ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఎలక్ట్రోరల్ సెర్చ్ ఇసిఐ.గవర్నమెంట్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఇవే వివరాలను పొందుపరిచి డిజిటల్ ఓటర్ స్లిప్‌ను పొందవచ్చును.

టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా

టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా..

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 24 గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు ఫోనుచేసి, ఓటర్ల వివరాలను, ఓటరు గుర్తింపు కార్డు నెంబర్ ను తెలియజేయడం ద్వారా కూడా పోలింగ్ కేంద్రం, బూత్ నెంబర్ తదితర వివరాలను పొందవచ్చు.

మెయిల్ ద్వారా...

ఎన్నికల సంఘానికి complaints @eci.gov.in మెయిల్ ద్వారా కూడా మన గ్రీవెన్స్‌ను ఇచ్చి, పోలింగ్ బూత్ వివరాలను తిరిగి మెయిల్ ద్వారానే పొందవచ్చు.

మొబైల్ యాప్‌తో...



ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఒఎస్ వినియోగ దారులు యాప్‌స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్ యాప్ అన్న అప్లికేషను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను ఇవ్వాలి. దీని ద్వారా ఏ నెంబర్ పోలింగ్ బూత్‌లో మీ ఓటు ఉందో పూర్తి వివరాలను. తెలుసుకోవచ్చు.



ఇలా కూడా పొందవచ్చు..

www.voters.eci.gov.in అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ అన్న ఆప్షనును సెలెక్ట్ చేసి, వ్యక్తుల వివరాలను పొందుపరచడం ద్వారా ఓటరు జాబితా వివరాలను తెలుసుకోవచ్చు. www.ceoap.niic.in .ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఆఫీసర్స్ డీటెయిల్స్, బూత్ లెవెల్ ఆఫీసర్స్ డీటెయిల్స్ అన్న ఆప్షన్ ద్వారా జిల్లా, నియోజవర్గం, అక్కడి పోలింగ్ కేంద్రాల వారీగా బిఎల్‌ఒల ఫోన్ నెంబర్లను తెలుసుకుని, వారికి ఫోన్‌చేసి బూత్ నెంబర్ వివరాలను పొందొచ్చు.

ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామారావు తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు అన్నారు. జివిఎంసి 43వ వార్డు పరిధి మురళీనగర్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఉత్తర నియోజకవర్గం ప్రజలు మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వర్షాలు పడితే కొండ చరియలు విరిగిపడుతున్నాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ఈ సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పశ్చిమంలో వైసిపి ప్రచారం

62వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న రమాకుమారి

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 62వ వార్డు కార్పొరేటర్ పల్లా లక్ష్మణరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గ పరిధి దుర్గానగర్‌లో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్తున్న రమాకుమారికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనంద్‌కుమార్‌ను ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం కల్పిస్తే ఐదేళ్లు మీకు సేవలు అందిస్తారని తెలిపారు. ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 62వ వార్డు వైసిపి అధ్యక్షులు బీశెట్టి గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందమూరినగర్‌లో ప్రచారం

ఆడారి ఆనంద్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ జివిఎంసి 92వ వార్డు పరిధి నందమూరినగర్‌లో వైసిపి మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవ చేసేందుకు ఒక్క ఛాన్సివ్వండి

- దక్షిణ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వంశీకృష్ణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం ప్రజలకు నిస్వార్థంగా సేవలు చేసేందుకు తనకు ఒక అవకాశం ఇవ్వాలని కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అభ్యర్థించారు. బుధవారం 32వ వార్డులో భీమ్ నగర్, పూతివారి మాన్యం, అస్సాం గార్డెన్స్, అమ్మవారి వీధి, జైలు రోడ్డు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి గాజుగ్లాస్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా టిడిపి అభ్యర్థి శ్రీభరత్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు నేరుగా కలిసి ప్రతి సమస్యను పరిష్కారం చేస్తానని,ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, టిడిపి, బిజెపి, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి -మునగపాక : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ మండల కేంద్రం మునగపాకతో పాటుగా చూచుకొండ, పల్లపు ఆనందపురం, గణపర్తి, గంటవాని పాలెం, ఉమ్మలాడ, నాగులపల్లి, తిమ్మరాజుపేట, రాజుపేట, కాకరపల్లి తదితర గ్రామాలలో బుధవారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. మండలంలో ఇప్పటికే 850 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఉద్దేశ్య పూర్వకంగాగాని, రాజకీయంగా గాని ఎటువంటి గొడవలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఎల్.సింగవరం, లోపూడి, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, బుచ్చయ్యపేట, పోలేపల్లి కందిపూడి, దిబిడి తదితర గ్రామాల్లో పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చయ్యపేట ఎస్సై డి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి వివాదాలకు పోకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కె.కోటపాడు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన సహించేది లేదని స్థానిక ఎస్సై లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిరసించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోను కావద్దని, నిర్భయంగా నచ్చిన వారికి ఓట్లు వేయాలని కోరారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ బుధవారం స్థానిక భీమునిగుమ్మి, మళ్ళవీధి ప్రాంతాల్లో గడపగడపకు ప్రచారం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కొణతాల రామకృష్ణను గెలిపించి ప్రజాస్వామ్య వ్యవస్థని కాపాడాలని మాజీ మంత్రి పడాల అరుణ అన్నారు. బుధవారం అనకాపల్లి మండలం వెంకుపాలెం, కుంచంగి గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భీశెట్టి బాబ్జి, కనుబుడ్డి నరసింగరావు, పడాల శరత్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని దొప్పెర్ల, నూనపర్తి గ్రామాలలో మంగళవారం రాత్రి యలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో కె.చిన్నారావు, గొంప నరసింహనాయుడు, చుక్కా అనురాధ పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

మునగపాక : మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి సుందరపు విజయ్ కుమార్ స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టెక్కలి పరశురాం, బొడ్డేడ అప్పలనాయుడు, సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

దేవరాపల్లి : దేవరాపల్లికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. సబ్బవరపు మాలిబాబు, కాటపల్లి సన్యాసిరావు, కాటపల్లి నాగభూషణం, కాటపల్లి అచ్చిబాబు, ఉల్లి చింతాలు, సబ్బవరపు సన్నిబాబు, కంచిమాల అప్పారావు, కాటపల్లి ఈశ్వరరావు, కాటపల్లి శ్రీను, కాటపల్లి చిన్నారావు తదితరులకు మాజీ ఎంపీపీ, ఇటీవలే టిడిపిలో చేరిన కిలపర్తి భాస్కరరావు పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు.

వ్యవసాయంలో ఎలుకల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కొన్నెంపూడి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల కింజరపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం కొన్నెంపూడి గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పద్ధతులలో భాగంగా రైతులకు ఎలుకలు నివారణ విషపు గులుకలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు శశికళ, పూజిత, శ్రావణి, పల్లవి, షారోన్, నిఖిత, తేజస్విని, ప్రత్యూష పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఆలయ కార్య నిర్వహణ అధికారి బండారి ప్రసాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి కేఎల్ సుధారాణి, అనకాపల్లి దేవాదాయ ధర్మాదాయ తనిఖీదారు శ్రీధర్ సమక్షంలో నిర్వహించారు. ఫిబ్రవరి 22 నుంచి మే ఏడో తేదీ వరకు 77 రోజులకు గాను రూ.66,69,415 నగదు, 31 గ్రాముల బంగారం, ఒక కిలో 700 గ్రాముల వెండి వచ్చింది. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీపుల్స్ మ్యానిఫెస్టో విడుదల

పీపుల్స్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న జెవిసి నాయకులు, స్థానికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం

జన విజ్ఞాన వేదిక రూపొందించిన పీపుల్స్ మేనిఫెస్టోను బుధవారం అచ్యుతాపురం మండలం, హరిపాలెం గ్రామంలో ఆ సంస్థ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బొడ్డేడ రామ్ కుమార్ మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్, సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ దాని ఆచరణ, పర్యావరణం, జల వనరులు, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ఆంధ్రప్రదేశ్ సంబంధించి విభజన హామీలు, విశాఖ ఉక్కు -ఆంధ్రుల హక్కు వంటి వాటిపై రాజకీయ పార్టీలు తమ కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాలకు జీడీపీలో తొమ్మిది శాతం కేటాయింపు, శాస్త్ర పరిశోధన కోసం మూడు శాతం కేటాయించడం, ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీలన్నీ ఒకేసారి ప్రకటించి భర్తీ చేయడం, ఒక హక్కుగా నిరుద్యోగ భృతి చెల్లించడం, విభజన హామీలకు రాష్ట్ర ప్రాజెక్టులకు అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రాన్ని డిమాండ్ చేసి రాబట్టడం, ప్రజల మధ్య సామరస్యం, సుహృద్భావం ప్రాణప్రదమైనవని భావించడం రాజ్యాన్ని మతానికి దూరంగా ఉంచడం, ఒక ఆధునిక దేశంగా తీర్చిదిద్దడం, రాజ్యాంగ పరిరక్షణ ఎన్నికల కమిషన్, సిబిఐ, ఈడి లాంటి సంస్థలను నిష్పక్షపాతంగా స్వతంత్రంగా పనిచేసేలా ఒక బలమైన చట్టం తేవడం, రాష్ట్ర వనరులను కాపాడడం, పర్యావరణ హితంగా రాష్ట్రాన్ని మార్చడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడం మొదలగు అందరి జీవితాలను ప్రభావితం చేస్తున్న విషయాలు ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు అనుకుంటే చేయగలిగే విషయాలేనని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాలపై తమ వైఖరి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు, కాండ్రేగుల రామ సదాశివరావు, కాండ్రేగుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

భరోసా ఇవ్వని మోడీ ప్రసంగం

సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

కశింకోట ప్రాంతంలో ఈ నెల 6న నిర్వహించిన ఎన్డిఎ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం ప్రజలకు ఎటువంటి భరోసాను ఇవ్వలేదని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకుంటామని, సొంత గనులు కేటాయిస్తామని మోడీ ప్రసంగంలో ఎక్కడ కనిపించలేదన్నారు. మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తుంటే అనకాపల్లి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ దానిని అడ్డుకుంటానని చెప్పడం ప్రజలను మోసం చేయడమే అవుతందని పేర్కొన్నారు. సుగర్ ఫ్యాక్టరీల వద్ద నిల్వ ఉన్న పంచదారను అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టడంతో ఫ్యాక్టరీలు నష్టాలు చెవి చూస్తున్నాయని, చెరకు పంటకు కేంద్ర మద్దతు ధర ప్రకటించకపోవడంతో రైతులు నష్టాల బారిన పడి చెరుకు సాగుకు దూరమవుతున్నారని తెలిపారు. సుగర్ ఫ్యాక్టరీల ఆధునికీకరణ, చెరుకు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తామని మోడీ ప్రకటించకపోవడం విచారకరమన్నారు. పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి, వైసీపీ అభ్యర్థులను ఓడించి ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ నాయకులు గాడి ప్రసాద్, రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురి చేస్తున్న సిఎం.రమేష్

అనకాపల్లి అభివృద్ధికి కొణతాల ఏం చేశారు ?

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి సీఎం రమేష్ జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడారి కిషోర్ కుమార్ ఆరోపించారు. స్థానిక వివేకానంద సమావేశ మందిరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపిలో ఉన్నప్పుడు నరేంద్ర మోడీని తెగ విమర్శించిన సీఎం.రమేష్‌పై అనేక ఎఫ్ఐఆర్ నమోదయ్యాయని గుర్తు చేశారు. బిజెపిలో చేరిన తరువాత సీఎం రమేష్ పునీతుడయ్యాడా? అని ఎద్దేవా చేశారు. స్థానికేతరులకు టికెట్ ఇస్తే సహించేది లేదని బీరాలు పలికిన అయ్యన్నపాత్రుడు, ఇప్పుడు సిఎం రమేష్‌కు ఎలా లొంగిపోయారని ప్రశ్నించారు. మూడు శాఖల మంత్రిగా పనిచేస్తున్న కొణతాల అనకాపల్లి ప్రాంతంలో చేసిన అభివృద్ధి, యువతకు కల్పించిన ఉపాధి అవకాశాలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్ల అజ్ఞాతంలో ఉండి ప్రజా సమస్యలను విస్మరించిన ఆయన నేడు ఏ ముఖంతో ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. జెడ్పి వైస్ చైర్‌పర్సన్ బివి సత్యవతి, వైసిపి నాయకులు బుద్ధ శ్రీనివాసరావు మాట్లాడుతూ తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని సీఎం రమేష్, సాధ్యం కాదని కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలను రైతులను మభ్యపెడుతున్నారన్నారు. సమావేశంలో అచ్యుత్, శేషు, వెంకటరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్య పరిరక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఓటర్లు తమ ఓటు హక్కును తప్పని సరిగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాలకు వెళ్లి అసోసియేషన్ ముద్రించిన 'మన ఓటు-మన హక్కు కరపత్రం' పంచుతూ ఓటు విలువ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ఓటును ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికలలో వేసి ఓటింగ్ శాతం పెంచాలని కోరారు. ఎన్నికల డ్యూటీలు పడిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రానికి బిజెపి ఏం చేసింది?

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి -అచ్యుతాపురం

బిజెపి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం వెలగబెట్టిందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ ప్రశ్నించారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక హెూదా కల్పించలేదని, స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తుందని, రైల్వే జోన్ ఏర్పాటుపై నోరు మెదప లేదని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడం లేదని తెలిపారు. బిజెపి, టిడిపి, జనసేన, వైసీపీ పార్టీలన్నీ ఒక్క తానులో ముక్కలేనని, ఆ పార్టీ అభ్యర్థులకు ఎవరికి ఓట్లు వేసిన బిజెపికే చెందుతాయని తెలిపారు. బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ప్రశాంతంగా ఉన్న అనకాపల్లి జిల్లాను కలుషితం చేస్తున్నారన్నారు. ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం రావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఎస్ బ్రహ్మాజీ, కె సోము నాయుడు, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి జగతా శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బొడ్డు శ్రీనివాస్, ఎంవిఆర్ రాహుల్, సిహెచ్ సుభద్రరావు, రావి రామసత్యం, పి.ఆదిమూర్తి పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మనసాల భరత్ కుమార్ జీవీఎంసీ 83వ వార్డు కార్పొరేటర్ జాజుల రమేష్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక వేల్పులవీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా 60 మంది మహిళలు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో ఎంపీ బివి.సత్యవతి, నాయకులు ఉగ్గిన అప్పారావు, బోండా శంకర్రావు పాల్గొన్నారు. జీవీఎంసీ 82వ వార్డులో కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ కుమార్ సతీమణి నివేదిత, నాయకులు గైపురి రాజు, పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సమక్షంలో బుధవారం మాజీ కౌన్సిలర్లు విన్నకోట రాజా సతీష్, విన్నకోట అన్నపూర్ణమ్మ, లట్టాల పద్మావతి, బిజెపి నాయకులు ఎల్ఐసి ఉమా, టీడీపీ నేత డొంక సాయి, టిడిపి కార్యకర్తలు వైసీపీలో చేరారు.

పరవాడ : మండలంలోని గోర్లివానిపాలెం పంచాయతీ పరిధి దిబ్బల గోర్లివానిపాలెంలో మంగళవారం రాత్రి వైసిపి నాయకులు గోర్లి గోపి అధ్యక్షతన భారీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీసీ సభ్యులు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిప్పాడ రామారావు, గొర్లి రామారావు, పోలి రెడ్డి అప్పారావు, చీపురుపల్లి దేముడమ్మ పాల్గొన్నారు.

సబ్బవరం : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం యాదవులకు రాజకీయంలో సముచిత స్థానం కల్పించినట్లు జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. మండలంలోని గొట్టివాడ దరి బిఎస్ఎన్ కళ్యాణమండపంలో పిఏసీఎస్ వైస్ చైర్మన్ పల్లా కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన యాదవుల ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పెందుర్తి జడ్పిటిసి ఉప్పిలి దేవి కనకరాజు, గోలగాని శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎలమంచిలి వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తి రాజు మండలంలోని ఆవ సోమవారం, ఇరువాడ, తంతడి రాజన్నపాలెం, నునపర్తి తదితర గ్రామాలలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో భాగంగా నడింపల్లిలో జనసేన పార్టీ నుండి వైసీపీలోకి పలువురు చేరారు. కార్యక్రమంలో కోలా నాగమణి, ఈత బాబురావు, పిల్లా సతీష్, చేకూరి శ్రీనివాసరాజు జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు కోన బుజ్జి దేశం శెట్టి శంకర్రావు పాల్గొన్నారు.

'కాపులకు అధిక సీట్లు'

చోడవరం : కాపులకు అధిక సీట్లు ఇచ్చి వైసిపి ఆదరించిందని కాపు జేఏసీ నాయకులు తోట రాజీవ్ అన్నారు. చోడవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి 31 మంది కాపులకు ఎమ్మెల్యే సీట్లు, ఐదు ఎంపీ సీట్లు ఇచ్చిందని, టిడిపి కాపులకు 23 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఒక కాపుకు కూడా సీటు ఇవ్వలేదన్నారు. దీంతో కాపు జేఏసీ రాష్ట్ర కమిటీ వైసిపికి మద్దతు ప్రకటిస్తుందన్నారు. కార్యక్రమంలో కాపు నాయకులు లంక మోహన్ రావు, రామదాసు, కులయ్య నాయుడు సేనాపతి సత్యారావు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువై..

నిర్మాణానికి నోచని గృహాలు

-విద్యుత్ స్తంభం, బోరు మాత్రమే ఏర్పాటు - ఇదీ జగనన్న గృహాల లబ్ధిదారుల దుస్థితి

ఆక్సాహెబ్ పేట నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అక్షర క్రమంలో ముందుండే అన్నవరం, ఆక్సాహెబ్ పేట గ్రామాలు మాత్రం అభివృద్ధితో పాటు ప్రభుత్వం నిర్మిస్తున్న కాలనీ ఇల్లు నిర్మాణాలలో ఆమడ దూరంలోనే అగుపిస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గొప్పలు చెప్పుకుంటున్న జగనన్న కాలనీ నిర్మాణాల పట్ల ఇల్లు కాదు ఊర్లు కట్టిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారే కానీ, ఆయా గ్రామాల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

జగనన్న కాలనీ ప్రారంభ తొలి నాళ్లలోనే ఇక్కడ ఏర్పాటు చేసిన లేఔట్లు నివాసయోగ్యానికి అసౌకర్యంగా ఉండటంతో లబ్ధిదారులు వాటిని చూసేందుకు కూడా చీదరించుకుంటున్నారు. అన్నవరం గ్రామం సమీపంలో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ఆనాటి రెవెన్యూ అధికారులు, స్థానిక రాజకీయ నాయకుల అనాలోచిత నిర్ణయంతో కొండ ప్రాంతం ఎంపిక చేయడంతో కనీసం లేఅవుట్ మొఖం చూసేందుకు కూడా లబ్ధిదారులు సుముఖత చూపటం లేదు. ఇక్కడ ఏర్పాటు చేసిన లేఔట్ ప్రభుత్వ స్థలం కాదు. ప్రైవేటు స్థలం సుమారు రూ.25 లక్షలు వెచ్చించి మరీ కొనుగోలు చేసి 53 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అధికారులు శతవిధాల ప్రయత్నాలు చేసినా ఇప్పటికీ ఆ స్థలంలో ఒక్కరు కూడా నిర్మాణం చేపట్టలేదు. ఇప్పుడు అదే స్థలం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారి పోయింది. గ్రామంలో ఐదుగురు సొంతంగా స్థలాలు కొనుగోలు చేసుకొని నిర్మాణాల చేపట్టుకుంటున్నారు. గ్రామంలో పలువురు గ్రామస్తులు ఆ స్థలం నివాసయోగ్యం కాదని ఆనాడు చెప్పినా.. పెడచెవిన పెట్టారు. సొంత ప్రయోజనాలను నాయకులు, అధికారులు ఆశించి కొనుగోలు చేశారు. అంతేకాకుండా అక్కడ రోడ్లు బోర్లు లెవెలింగ్ కోసం మరి కొన్ని లక్షలు ఖర్చు చేశారు. అంతా వృధా.. ఇప్పటికీ ఒక్క ఇల్లు కూడా నిర్మించలేకపోయారు.

ఇదే పరిస్థితి ఆక్సాహెబ్‌పేట గ్రామంలో నెలకొంది. గ్రామంలో కాలనీ ఇళ్ల నిర్మాణాల కోసం అధికారులు ఒకటి కాదు రెండు చోట్ల స్థలం ఎంపిక చేశారు. మొదట ఒక స్థలం 21 లబ్ధిదారుల కోసం ఎంపిక చేసి భూమి లెవెలింగ్ కోసం డబ్బులు ఖర్చు చేశారు. ఆ తర్వాత గ్రామంలో వేరొక చోట స్థలం ఎంపిక చేసి అక్కడ లెవెలింగ్ రోడ్లు, కరెంటు లైన్ సహా బోరు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. కానీ ఆ ప్రదేశాన్ని కూడా గ్రామస్తులు, ప్రజలు తిరస్కరించారు. స్థానిక రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసమే స్థలాల ఎంపిక చేయడం అక్కడ లెవెలింగ్ బోరు, కరెంటు ఇతరత్రా ఖర్చుల కోసం లక్షలు ఖర్చు చేయడం వృధా చేయమంటూ స్థానికులు వాపోతున్నారు. దీంతో లబ్ధిదారులు ఆశలు అడియాసలు అవుతున్నాయి. ప్రస్తుతం అధికారులు, నాయకులకు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో దిక్కులు చూస్తున్నారు. కట్టుకుందామంటే స్థలం లేక ప్రభుత్వం కేటాయించిన స్థలం నిరుపయోగంగా ఉండటంతో ఏమి చేయాలో అర్థం కాక ఎవరికి చెప్పుకోవాలో తెలియక తికమకపడుతున్నారు.

ఇంత జరుగుతున్నా నియోజకవర్గ స్థాయి నాయకులు మాత్రం నోరు మెదపకపోవడం విశేషం. ప్రధానంగా ఆయా గ్రామాలలో దళితులే ఎక్కువగా ఉండటం విశేషం. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా గ్రామాలకు ప్రత్యేకంగా స్థలం కేటాయించి ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టాలని కోరుకుంటున్నారు.

అన్నవరంలో నిరుపయోగంగా ఉన్న బోరు

పాలిసెట్ ఫలితాల్లో

వీనస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మాడుగుల: పాలీసెట్ ఫలితాలలో మాడుగుల వీనస్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభను కనపరిచారు. పాలిసెట్ పరీక్షకు సంబంధించిన ఫలితాలు బుధవారం విడుదల కాగా మాడుగుల వీనస్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారని ఇన్స్టిట్యూట్ కరస్పాండెంట్ తాళ్లపురెడ్డి నాగ చంద్ర తెలిపారు. మాడుగుల, బుచ్చయ్యపేట, చీడికాడ మండలాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. వీరిలో తామరపల్లి హేమన్య 120 మార్కులకు గాను 103 మార్కులు సాధించిందన్నారు.అలాగే రెడ్డి గణేష్ 91 మార్కులు, రాపేటి హేమశ్రీ 91 మార్కులు, బొండా లోకేష్ 89, హైమావతి 87, కటకం తేజస్వి 77 మార్కులతో తమ ప్రతిభను కనపరిచారు. మంచి మార్కులు తెచ్చుకున్నందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇన్స్టిట్యూట్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

హేమన్య

యువకులు రక్తదానం చేయాలి

ప్రజాశక్తి పాడేరు: ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని పురస్కరించుకొని పాడేరు అల్లూరి జిల్లా బ్రాంచ్ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ, హెన్రీ డ్యూనాంట్ స్ఫూర్తితో ప్రపంచ దేశాలలో అత్యవసర సేవలను అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి అభినందనలు తెలిపారు. ప్రజలు, యువకులు సేవా దృక్పథంతో స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ సంస్థలో చేరి సేవలందించాలని సూచించారు. ఉత్సాహవంతులైన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ప్రాణాపాయంలో ఉన్న రోగులకు ప్రాణ దాతలుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ లోహితాస్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పి.సూర్యారావు, వి.జయలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

కార్డులు, పత్రాలు అందజేస్తున్న గీతాంజలి

ప్రజాశక్తి -నక్కపల్లి:పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బూత్ లెవెల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె గీతాంజలి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బూత్ లెవెల్ అధికారులకు పిడబ్ల్యుడి ఓటర్లకు సంబంధించిన కార్డులు, పత్రాలను అందజేసారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, వికలాంగులు త్వరితగతిన ఓటు వేసే విధంగా సౌకర్యం కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టి పాలెం గ్రామ పంచాయతీకి చెందిన పొట్ల శ్రీను, బోగేటి అప్పలరాజు, అల్లంపల్లి మాణిక్యం తదితర ఎనిమిది కుటుంబాలు బుధవారం వైసీపీ నుంచి టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని భావించి పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని రత్నంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్ల నాగేశ్వరరావుతో పాటు ఐదు కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రత్నంపేట సర్పంచ్ పిట్ల బుల్లిబాబు, ఉప సర్పంచ్ ఉడి వెంకటరమణ, బత్తిన సోమినాయుడు, పిల్లా అప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుల్లిబాబు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రోలుగుంటలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

కూలిన విద్యుత్ స్తంభం

మాడుగులలో భారీ వర్షం

- నేల కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగులలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు అలుముకొని ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలమైన గాలులకు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మండలంలోని కోడూరు సమీపంలో శ్రీరాంపురం గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభం నేల కూలింది. దీంతో గ్రామానికి పూర్తిగా విద్యుత్ అంతరాయం కలిగింది. గ్రామంలో అనేక చోట్ల అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. ఎట్టకేలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నేతల ప్రచారం

ప్రజాశక్తి - చీడికాడ:మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు. మండల కేంద్రంలో బుధవారం వామపక్షపార్టీ నేతలతో ఇంటింటికి ప్రచారం చేశారు. మాడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థిగా వేగి వెంకటేష్‌ని గెలిపించాలని ఓటర్ల ను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ వద్ద ఓటర్లు

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి-నక్కపల్లి:ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ బుధవారంతో ప్రశాంతంగా ముగిసాయి. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు రోజులు పాటు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలోనూ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని అరకు పార్లమెంటు నియోజక వర్గం సాధారణ పరిశీలకులు ప్రమోద్ కుమార్ మెహర్ద సూచించారు. మన్యం పార్వతీ పురం కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారులు, సాలూరు, కురుపాం, పాలకొండ పాడేరు, అరకువ్యాలీ, రంపచోడవరం, పార్వతీపురం నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల అభ్యర్థులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు సహకారంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడారు.

ముస్లిముల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

యువతకు అధిక ప్రాధాన్యం : కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : యువతకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు తెలిపారు. జివిఎంసి 50వ వార్డుకు చెందిన పూజారి అమరనాథ్ (అంబు), 53వ వార్డు స్టార్ యూత్ ఆధ్వర్యాన పలువురు యువకులు కెకె రాజు సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, వైసిపి గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకటరావు, నాయకులు జివి.రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తి సింకా గ్రాండ్‌లో వైసిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐహెచ్ ఫారుకి ఆధ్వర్యాన ముస్లిముల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

వార్డుల్లో అదీప్‌రాజు రోడ్డుషో

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94, 95, 96 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజు బుధవారం రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేశారన్నారు. అభివృద్ధి ఆగలేదన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన జగన్మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. ముగ్గురు కూటమిగా ఏర్పడి జగన్‌పై యుద్ధం చేస్తున్నారని, ఈ యుద్ధంలో వైసిపిని ఆశీర్వదించాలని కోరారు. స్థానికుడినైన తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్డాల రామరాజు, ప్రసాద్, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో సిపిఎం అభ్యర్థికి ఆదరణ

ప్రజాశక్తి -ఉక్కునగరం : గాజువాక నియోజకవర్గం పరిధిలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు ప్రచారానికి విశేష స్పందన లభిస్తోంది. గాజువాక నియోజకవర్గ పరిధి అగనంపూడి పరిసర ప్రాంతాలలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని జగ్గునాయుడు నిర్వహించారు. అగనంపూడి, కొండయ్యవలస, పూడిమడక, దొంకాడ, కొత్తూరు తదితర ప్రాంతాలలో పర్యటించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, నిర్వాసితుల కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, వేలాది మంది నిర్వాసితులు ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఎలాంటి న్యాయం చేయకుండా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న కుట్రలను అడ్డుకోవటానికి బలమైన పార్టీ కావాలన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కోసం చిత్తశుద్ధితో మూడేళ్లుగా పోరాడుతున్న పార్టీ సిపిఎం అని గుర్తుచేశారు. గంగవరం పోర్టు కాలుష్యం, అగనంపూడి టోల్‌గేట్ సమస్యను, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో గళం విప్పే సత్తా సిపిఎం అభ్యర్థికి మాత్రమే ఉంటుందని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పాటుపడుతున్న ప్రతి కార్మికుడు, నిర్వాసితుడు సిపిఎం అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి, స్థానికులు మరిడయ్య, సిపిఎం నాయకులు ఎస్.రామారావు పాల్గొన్నారు.

అగనంపూడి దిబ్బపాలెంలో ప్రచారం చేస్తున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి తదితరులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తాం : పంచకర్ల

ఆత్మీయసమావేశాల్లో మాట్లాడుతున్న రమేష్‌బాబు

ప్రజాశక్తి-పెందుర్తి : ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని పెందుర్తి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు చెప్పారు. జివిఎంసి 92వ వార్డు పరిధి బాలాజీ గార్డెన్‌లో బాలాజీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, 97వ వార్డు పరిధి సుజాతనగర్ ప్రైవేట్ కల్యాణ మండపంలో కమ్మ సామాజికవర్గం ఆత్మీయ సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, రాక్షసులను ఓడించి మనం గెలవాలని పేర్కొన్నారు. అభివృద్ధి లేకపోవడంతో ఉపాధి అవకాశాలు ఎక్కడా లేవన్నారు. ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల అధినేత మాండవ రవికుమార్, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి శంకరరావు, కమ్మ సామాజిక వర్గాన్ని చెందిన కిషోర్ కుమార్, సత్య, గంగాధర్, అర్జున్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వని

మోడీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు

అనకాపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎపికి విభజన హామీలు అమలు చేయకుండా, ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసి ప్రధాని మోడీ జిల్లా, రాష్ట్ర ప్రజలను ఎలా ఓట్లు అడుగుతున్నారని ఇండియా కూటమి బలపర్చిన అనకాపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్ ప్రశ్నించారు. స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపిలో ఐదువేల కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మించామని బహిరంగ సభలో చెప్పారని, మిగిలిన రాష్ట్రాల్లో వేసిన జాతీయ రహదారులను ఎపిలో వేసినట్లు మోడీ భ్రమిస్తున్నారా అని ప్రశ్నించారు. విభజన హామీలు అమలు చేయకపోవడంపై 2019లో చంద్రబాబు మోడీని విమర్శించారని, నేడు అదే వ్యక్తితో ములాఖత్ అయి ఎన్నికలకు రావడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు భూమి కేటాయించామని వైసిపి ప్రభుత్వం చెబుతుండగా, ఇవ్వలేదని బిజెపి చెప్పడం ఆ రెండు పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై మోడీ ఎందుకు మాట్లాడలేదన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేవలం వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాటాలు చేస్తున్నాయని చెప్పారు. 2019 ఎన్నికల్లో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు లిక్విడేషన్ దిశగా అడుగులు వేయడం బాధాకరమన్నారు. జిల్లాలో రోడ్లు, బ్రిడ్జిలు అధ్వానంగా ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్తు చార్జీలు పెంచిందని గుర్తు చేశారు. బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ తన కేసుల నుండి తప్పించుకునేందుకు టిడిపి నుంచి బిజెపిలోకి వెళ్లి పునీతుడైనట్లు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. కేవలం ఈ ప్రాంత వనరులను దోచుకునేందుకే సిఎం రమేష్ అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్నాడని విమర్శించారు. ఇండియా వేదిక పార్టీలతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులు రుత్తల శ్రీరామ్మూర్తి, బొడ్డు శ్రీనివాసరావు, ఐఆర్ గంగాధర్, బోని తాతారావు, అనంతరావు, భగత్, సిపిఎం జిల్లా నాయకులు గంట శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెంకటేష్, చిత్రంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరుతూ జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి మోహన్ దహికర్‌కి టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో సమస్యాత్మకంగా ఉన్న నర్సీపట్నం (86), పాయకరావుపేట (63), చోడవరం (39), మాడుగుల (60) పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగే వేళ ప్రత్యేక భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసి, వైసిపి నాయకులు కార్యకర్తలు ఎటువంటి అరాచకాలకు పాల్పడకుండా, ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేలాగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కోట్ని బాలాజీ, లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

13న దుకాణాలు, సంస్థలకు సెలవు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : సార్వత్రిక ఎన్నికల్లో కార్మికుల తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి దుకాణాలకు, సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినట్లు చోడవరం సహాయ కార్మిక శాఖ అధికారి వి.సూర్యనారాయణ తెలిపారు. బుచ్చయ్యపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ చోడవరం కార్మిక శాఖ కార్యాలయ పరిధిలో సబ్బవరం, బుచ్చయ్యపేట, చోడవరం, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి, రావికమతం తదితర మండలాల్లోని కార్మికులు వివిధ సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్‌పై ఫిర్యాదు

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికల నిబంధనల ఉల్లంఘిస్తున్న అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డిఆర్ఒ దయానిధికి సిపిఎం జిల్లా కమిటీ బుధవారం ఫిర్యాదు చేసింది. బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్ ఎన్నికల నిబంధనలను పూర్తిగా విస్మరించి ప్రచారం చేయడం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, తాయిలాలు పంచడం, కుల, మతాల ప్రాతిపదికన ప్రచారం, సమావేశాలు నిర్వహించడం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. అలాగే సిఎం.రమేష్ అభ్యర్థికి సంబంధించిన కరపత్రాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రచురణకర్త పేరు, ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఎన్ని కాపీలు వంటి వివరాలు లేకుండానే లక్షలాది కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని తెలిపింది. ఓటర్లను బిజెపి ఎన్నికల గుర్తు "కమలం పువ్వు" ఆకారంతో విసనకర్రలను, కీ-చైన్లు రూపొందించి వాటిని, స్వీట్ బాక్సులు మహిళా కోలాట దళాలకు బిజెపి ఎన్నికల గుర్తుతో కలిగిన చీరలు వంటివి పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని విమర్శించింది. గ్రామాలలో కుల సంఘాలను, ఇతర మతాలను దూషించే విధంగా ప్రసంగాలు చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వందలాది మందిని ఎన్నికల ప్రచారం పేరుతో అనకాపల్లి జిల్లాకు తీసుకువచ్చి మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సిఎం.రమేష్ ప్రచార రథాలకు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద డిజె సౌండ్ సిస్టమ్స్ ఎటువంటి అనుమతులు లేకుండా కట్టి ఉపయోగిస్తున్నారని తెలిపారు. డబ్బు, మంద బలంతో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సిఎం.రమేష్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ కోరింది.

ఏలేరు కాలువలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. ఏలేశ్వరం నుండి స్టీల్ ప్లాంట్‌కు నీరు వెళ్లే ఏలేరు కాలువలో ఈ మృతదేహం కొట్టుకొచ్చింది. చీర జాకెట్ ధరించి వుంది. ఈ మహిళను గుర్తించి సమాచారం అందజేయాలని పోలీసులు కోరారు. సిఐ వినోద్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.